క్లుప్తంగా

అంగన్‌వాడీలో అన్నప్రాసనం



ఐరాల: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసనం కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ మస్తానీబేగం ఆధ్వర్యంలో ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా వైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. సీఆర్పీ శైలజ పాల్గొన్నారు.

ముగిసిన రోడ్డు భద్రతా వారోత్సవాలు

గుడిపాల: రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలో బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణాన్ని చేపట్టిన మోంటి కార్లో లిమిటెడ్ కంపెనీలో ఈ వారోత్సవాలు నిర్వహించారు. చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ షంసుల్ హక్ మాట్లాడుతూ వారోత్సవాల లక్ష్యం, ప్రాముఖ్యత, ట్రాఫిక్ నియమాలు, పాదచారుల భద్రతా జాగ్రత్తలను వివరించారు. అనంతరం క్విజ్ పోటీ విజేతలు, బెస్ట్‌సేఫ్టీ డ్రైవర్స్‌కు బహుమతులను ప్రదానం చేశారు.

మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడిగా హిదాయత్



బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడిగా తగ్గువారిపల్లెకు చెందిన హిదాయత్ నియమితులయ్యారు. మండల మైనారిటీ సెల్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి సమక్షంలో నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా పర్వీన్ సర్దార్, సుహేల్‌అహ్మద్, కార్యదర్శులుగా గఫార్ బాషా, సునీల్ అహ్మద్, నాసీర్‌బాషా, సభ్యులుగా నిస్సార్, ఖాజా, మీరా నియమితులయ్యారు.

ఘనంగా కప్రేకర్ జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక ప్రేవేటు పాఠశాలలో బుధవారం భారతీయ గణిత శాస్త్రవేత్త రామచంద్ర కప్రేకర్ 118వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. గణిత అవధాని జనవిజ్ఞాన వేదిక, గణిత ఫోరం ఆధ్వర్యంలో అష్టావధాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమత విభాగం కన్వీనర్ శ్యామలాదేవిని దుశ్శాలువతో సన్మానించారు.

చిన్నారులను అలరించిన 'చిన్న కొండచుట్టు'



భేరివీధిలో చిన్న కొండచుట్టు సందడి

నగరి : పట్టణంలోని భేరివీధిలో బుధవారం నిర్వహించిన చిన్న కొండచుట్టు ఉత్సవాలు చిన్నారులను అలరించాయి. కొండచుట్టు ఉత్సవాలకు మరుసటి రోజున భేరివీధిలో చిరు వ్యాపారులు దుకాణాలు పెట్టడం పరిపాటి. దీంతో వీధిలో తిరనాళ్ల సందడి నెలకొంది. స్థానికులు దీన్ని చిన్న కొండచుట్టు ఉత్సవాలుగా పిలుచుకుంటారు. చిన్నారుల ఆటబొమ్మలు, మహిళలకు సంబంధించిన అలంకరణ వస్తువులు, చెరుకు గడలు, తినుబండారాలు ఇక్కడ అధికంగా విక్రయించారు. వివిధ రకాలైన రంగుల రాట్నాల్లో తిరగడానికి పిల్లలు ఉత్సాహం చూపారు. దీంతో వీది మొత్తం జనంతో నిండిపోయింది.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

చిత్తూరు అర్బన్: నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయనకు ఘన నివాళులర్పించారు. ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించి, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పుత్తూరు రోడ్డులో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు నాని, ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ హేమలత, నాయకులు ఆనంద్, త్యాగరాజులు, మురుగ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు జయప్రకాష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, జయచంద్రనాయుడు, ప్రకాష్‌నాయుడు, కవి, లోక, గిరి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- గడపగడపకూ మన ప్రభుత్వంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- మండల మీట్‌కు గైర్హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులపై ఆగ్రహం





బంగారుపాళెం: తూంపాయనపల్లెలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, తవణంపల్లె: మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బంగారుపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని శెట్టేరి గ్రామ సచివాలయం పరిధిలోని తూంపాయనపల్లె, మిట్టూరు గ్రామాల్లో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎస్ బాబు గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలకు అర్హత కలిగిన వారు ఇంకా ఎవరైనా ఉన్నట్లైతే వారిని గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గుర్తించి సంక్షేమ పథకాలను అందించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

అవ్వా.. తాతా.. అని పిలుస్తూ పింఛన్లు అందుతున్నాయా లేదా అంటూ ఎమ్మెల్యే వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. వలంటీర్లే వచ్చి పింఛను డబ్బులు ఇచ్చిపోతావుండారయ్యా అని వారు తెలిపారు. మళ్లీ జగనే సీఎంగా రావాలయ్యా.., వచ్చే ఎన్నికల్లో మా మద్దతు జగన్‌కే అంటూ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు సునీల్, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో హరిప్రసాద్, తహసీల్దార్ బెన్నురాజ్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశాలకు డుమ్మాకొట్టే వారిపై చర్యలు

తవణంపల్లె: "అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సమస్యలపై చర్చించడానికే మూడు నెలలకోసారి అధికారులు, ప్రజాప్రతినిధులతో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నాం... సమస్యలపై చర్చించడానికి ప్రజాప్రతినిధులు వరుసగా మూడు సమావేశాలకు హాజరుకాకపోతే ఇక సమావేశాలు ఎందుకు.. గైర్హాజరౌతున్న అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు రిపోర్టు పంపండి.'' అంటూ పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్. బాబు ఎంపీడీఓను ఆదేశించారు. బుధవారం తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో తవణంపల్లె ఎంపీపీ గీతారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి మండలంలోని 15 మంది ఎంపీటీసీలకుగాను ఏడుగురు మాత్రం హాజరయ్యారు. దీనిపై ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు, ఎంపీపీ గీతారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, సమస్యలపై చర్చించి పరిష్కరించుకోవడానికి ప్రధానంగా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నాం. ఈ సమావేశాలకు ఎంపీటీసీలు రాకపోవడం దురదృష్టకరం అన్నారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు సేవ చేయాల్సిన ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడ్డారు. ఇలాగైతే ఇక మండల మీట్‌కు రానని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులతో మండల ప్రగతిపై క్షుణ్ణంగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. మండలంలో శ్మశాన వాటిక, దారి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, పూర్తి పనులను ఎప్పటికప్పుడు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సులను ప్రయాణికులకు సౌకర్యంగా నడపాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరా చేయించాలని తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ భారతి, మండల వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ సుశీలమ్మ, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లె సచివాలయం పరిధి కరిడివారిపల్లెలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలు తెలుసుకుంటారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని కోరారు.

గుడిపాల మండలంలో..

గుడిపాల: మండలంలో 20వ తేదీ నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉపేంద్ర బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఉదయం 6:30 నుంచి 12:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20, 21వ తేదీల్లో పేయనపల్లె పంచాయతీ, 23, 24వ తేదీల్లో చీలాపల్లె, 25, 26 తేదీల్లో 189 కొత్తపల్లె, 27,28 తేదీల్లో బసవాపల్లె పంచాయతీలలో కార్యక్రమం ఉంటుందని ఆయన తెలియజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



పానాటూరు పంచాయతీలో నిర్వహిస్తున్న పాడి పశువుల వైద్యశిబిరం

గుడిపాల: పాడి పశువులకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని బొమ్మసముద్రం పశువైద్యాధికారి రవితేజ తెలిపారు. పానాటూరు పంచాయతీలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. అందులో ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు గాలికుంటు వ్యాధి, పొదుగు, గొంతువాపు వ్యాధులు సోకుతున్నాయని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధుల నుంచి పశవులను రక్షించుకోవచ్చని సూచించారు. జ్వరం, గొంతువాపు, ముక్కులో నుంచి చీమిడి కారడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యం అందించాలని సూచించారు. అనంతరం 170 పశువులకు పిడిదుల నివారణ మందు పిచికారీతోపాటు డీ వార్మింగ్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుళ్లిన రొయ్యలు.. బూజు పట్టిన మాంసం


- చిత్తూరులో టీడీపీ నాయకుడి హోటల్‌లో ఘనకార్యం
- తనిఖీలు చేసి మూయించిన కమిషనర్
- మరో హోటల్‌కు నోటీసులు.. చర్యలకు సిఫార్సు



భాస్కర హోటల్‌లో కుళ్లి దుర్వాసన వస్తున్న మాంసాన్ని ఫ్రిడ్జ్ నుంచి బయటకు తీస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో మూడు రోజుల్లో 21 గ్యాస్ట్రో ఎంటిరైటిస్ (జీఈ) కేసులు నమోదయ్యాయి. దీంతో అప్రమత్తమైన చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ నగరంలో రద్దీగా ఉండే రెండు హోటళ్లలో ప్రజారోగ్య శాఖ సిబ్బందితో కలిసి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొంగారెడ్డిపల్లెలో ఉన్న టీడీపీ నాయకుడు జయప్రకాష్ నాయుడుకు చెందిన హోటల్ ఎస్‌పీఎస్ భాస్కరలో తొలుత తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల నిల్వలు, వంట గది, వంట మనుషుల పరిస్థితి చూసి కమిషనర్ షాక్‌కు గురయ్యారు. గోర్ల నిండ మట్టి, కొందరికి కాలిన గాయాలు. వంటచేసే వ్యక్తుల చేతులకు కనీసం తొడుగులు కూడా లేదు. అలాగే వంటచేసి వడ్డించేస్తున్నారు. ఇక్కడ వినియోగిస్తున్న రొయ్యలు వారం రోజులక్రితం తెచ్చినట్లు గుర్తించారు. ఇవి దారుణంగా కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నట్లు గుర్తించారు. చేపలు కూడా చాలాకాలం క్రితం తెచ్చినట్లు గుర్తించారు. వీటికి సింథటిక్ రంగులు, ఇతర రసాయ పదార్థాలు కలిపి ఫ్రిజ్‌లో పెట్టినట్లు గుర్తించారు. ఫ్రిజ్‌లో నిల్వ చేసిన చేపలను బయటకు తీస్తే భరించలేని వాసన వస్తోంది. కిలోలకొద్దీ చికెన్, మటన్ సైతం ఫ్రిజ్‌లలో నిల్వ చేశారు. వాటికి బూజు పట్టి ఉండటాన్ని గమనించారు. పుట్టగొడుగుల నుంచి క్రిములు బయటకు రావడం, కొన్ని ఆహార పదార్థాల ప్యాకింగ్ కాలం చెల్లి ఏడాది గడుస్తుండడం కూడా వెలుగులోకి వచ్చాయి. ఫుడ్ శ్యాంపిల్స్‌ను అధికారులకు అందచేసిన కమిషనర్ భాస్కర హోటల్‌ను మూయించారు. రూ.5 లక్షల వరకు ఆస్తిపన్ను సైతం కార్పొరేషన్‌కు చెల్లించలేదని, భవన నిర్మాణానికి సంబంధించి అనుమతుల ఉల్లంఘనను కూడా పరిశీలించి చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ చెప్పారు. కాగా, హైరోడ్డులోని విష్ణుభవన్ హోటల్‌ను పరిశీలించిన కమిషనర్.. ఇక్కడున్న వంటశాలను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు ఆహార పదార్థాల ప్యాకింగ్‌పై కాలం చెల్లిన తేదీలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. వారం రోజుల్లో మరోసారి తనిఖీలు చేస్తామని, పరిస్థితి మెరుగుపడకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోలాహలంగా ఎడ్ల పందేలు



దూసుకొస్తున్న ఎద్దు

ఐరాల: మండలంలోని కంచంవారిఇండ్లు గ్రామంలో బుధవా రం కోలాహలంగా ఎద్దుల పోటీలను గ్రామస్తులు నిర్వహించారు. కనుమ పండుగ మరుసటి రోజు కంచంవారిఇండ్లులో ఎద్దుల పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో వెలసిన సత్యమ్మకు ప్రత్యేక పూజలు, పొంగిళ్లు, అభిషేకాలు చేశారు. గోవులు, ఎద్దులను శుభ్రం చేయించి, కొమ్ములకు రంగులు వేశారు. పూలమాలలు, రంగు కాగితా లు, గాలిబుడగలతో అలంకరించి, పూజలు చేశారు. అనంతరం ఎద్దులు, కోడెగిత్తలను పరుగులు తీయించారు. కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు, పెద్దలు పోటీ పడ్డా రు. గిత్తలకు కట్టిన తాళ్లను పట్టుకున్న యువకులు విజయో త్సాహంతో కేరింతలు కొట్టారు. ఈ పోటీలను తిలకించేందుకు వచ్చిన జనంతో గ్రామం సందడిగా మారింది. మిద్దెలు, చెట్లు ఎక్కి పోటీలను తిలకించారు.



ఎద్దును నిలువరిస్తున్న యువకుడు

జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలోని జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆదేశించారు. తన చాంబర్‌లో బుధవారం హౌసింగ్, మెప్మా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని లే–అవుట్లలో ప్రస్తుతం 1,273 నిర్మాణాలు పలు దశల్లో ఉన్నాయన్నారు. వీటన్నింటినీ మార్చి 22వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకోసం లబ్ధిదారుల వివరాలను మెప్మా సిబ్బంది, వార్డు కార్యదర్శులకు మ్యాపింగ్ చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ శ్రీధర్, సీఎంఎం గోపి పాల్గొన్నారు.

బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లదే

పూతలపట్టు: మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఎంపీడీఓ గౌరి ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె బుధవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ, మండలంలో 1875 గృహాలు మంజూరైనట్లు తెలిపారు. అందులో 1703 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన వాటిని వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. లబ్ధిదారుల దగ్గరకు వెళ్లి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఆదేశించారు. సకాలంలో బిల్లుల చెల్లింపులు అవుతున్న విషయాన్ని వారికి తెలియజేయాలని చెప్పారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేయాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ ముఖహాజరు తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ముఖహాజరు నమోదు చేయాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని విభాగాల అధిపతులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ రాష్ట్ర ప్రభుత్వం ఫేషియల్ హాజరు తప్పనిసరి చేసిందన్నారు. ఇందులో ఏపీఎఫ్ఆర్ఎస్ యాప్‌లో పేరు నమోదు చేసుకొని హాజరు కచ్చితంగా వేయాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెలవుకోసం అనుమతి తీసుకుంటే ఆన్‌లైన్‌లో కచ్చితంగా అప్లోడ్ చేయాలని స్పష్టం చేశారు. శాఖలవారీగా విధులకు దీర్ఘకాలిక గైర్హాజరైన వారిపై చర్యలు చేపట్టాలని, అలాంటి ఫైల్స్ ఉంటే వెంటనే పంపాలన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, పీఆర్,ఆర్–బి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు చంద్ర శేఖర్ రెడ్డి, దేవానందం, నాగ జ్యోతి, హౌసింగ్ పీడీ పద్మ నాభం, సీపీఓ ఉమాదేవి, డ్వామా పీడీ గంగా భవాని, డీపీఓ లక్ష్మి, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ సంక్షేమ జిల్లా అధికారులు రాజ్యలక్ష్మి, రబ్బానీ బాషా, చిన్నారెడ్డి మూర్తి ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముడత రోగం నివారణకు సూచనలు



ఎగువ మోదలపల్లెలో మిరప పంటను పరిశీలిస్తున్న అధికారులు

తవణంపల్లె: మండలంలో సాగు చేసిన మిరప పంటలో ముడత రోగం నివారణకు అధికారులు సూచనలు ఇచ్చారు. మారేడుపల్లె, దిగువ మోదలపల్లెలో బుధవారం వరి, రాగి, మిరప పంటను వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం అధికార బృందం పరిశీలించింది. డిప్యూటీ డైరెక్టర్ గోపాల్, ఏడీఏ నాగపద్మిని, వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న, వ్యవసాయాధికారి ప్రవీణ్ పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరి పంటలో జింకు లోపం నివారణకు ఆఖరి దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింకుసల్ఫేటు ఎరువును వాడాలని సూచించారు. మిరప పంటలో ముడత రోగం అధికంగా ఉందని రైతులు అధికారులకు సూచించారు. దీంతో రైతులు మిరపలో ఆకు పై ముడత నివారణకు ఇమడాక్లోఫ్రిడ్ మందును 0.2 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మిరపలో ఆకు కింద ముడత నివారణకు టోకెన్ మందును 0.5 గ్రాములు, వేప నూనె 2 మిల్లీలీటర్లు చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పట్టు సాగుకు మరింత ప్రోత్సాహం

- మల్బరీ సాగులో ఏడాదికి ఐదు నుంచి ఆరు పంటలు
- ఏనుగుల బెడద తక్కువ
- సమీక్షలో కలెక్టర్ హరినారాయణన్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : మంచి ఆదాయం ఉన్న పట్టు సాగుకు మరింత ప్రోత్సాహం అందించి, రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడాలని కలెక్టర్ హరి నారాయణన్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం పట్టు సాగుపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మొదట పట్టు పరిశ్రమ శాఖ ద్వారా ఇస్తున్న పలు రాయితీలపై సంబంధిత జాయింట్ డైరెక్టర్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒక ఎకరా విస్తీర్ణంలో మల్బరీ సాగు చేస్తే ఐదుగురికి ఉద్యోగం ఇచ్చినట్టుగా ఉంటుందని చెప్పారు. డిప్లొమా చేసిన వారికి మంచి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఏడాదికి ఐదు నుంచి ఆరు పంటలు వచ్చే అవకాశం ఉందని వివరించారు. మంచి ఆదాయం ఈ శాఖ ద్వారా వస్తున్నందున రైతులను మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి 100 గుడ్లకు 75 కిలోల వరకు దిగుబడి వస్తోందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహకాలు అందరికీ అందేలా చూడాలని అన్నారు. జిల్లాలో ఎక్కువ సాగు చేస్తున్న రామకుప్పం, శాంతిపురం, వీకోట, బైరెడ్డిపల్లి, పలమనేరు, గంగవరం మండలాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేశారు. ప్రధానంగా ఈ పంటకు ఏనుగుల బెడద తక్కువగా ఉన్నందున అటవీ ప్రాంతాలలో ఈ పంటను సాగే చేసేలా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఎప్పటికప్పుడు పరిష్కరించండి

రైతుల సమస్యలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. వ్యవసాయ శాఖ సమీక్షలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఖర్చు తక్కువ, ఆదాయం ఎక్కువగా వచ్చే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రధానంగా భూసారాన్ని బట్టి పంటలను వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలుగా జామ, బొప్పాయి, మిరప, చింత, దానిమ్మ, అరటి, డ్రాగన్ ఫ్రూట్, పాషన్ ఫ్రూట్, ఆమ్లా, కరొండ, వంటి పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. పంటల ఉత్పత్తి ప్రారంభం నాటు నుంచి రైతులకు అవగాహన కల్పించి మంచి ఆదాయం వచ్చేలా చూడాలని ఆదేశించారు. నాణ్యత గల కూరగాయలు, పూలు, పండ్లు ఉత్పత్తి చేయించడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూధన్ రెడ్డి, కోటేశ్వర రావు పాల్గొన్నారు.

మరింత బాగా పనిచేయాలి

జిల్లాలో వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల అధికారులు మరింత బాగా పనిచేసి ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ అన్నారు. గర్భిణులు, చిన్నపిల్లల్లో రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారికి సరైన వైద్యం అందించాలన్నారు. సకాలంలో ఆహారం అందించే ప్రక్రియను చేపట్టాలని చెప్పారు. జిల్లాలో అనీమియా సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని సూచించారు. సీజన్లో వచ్చే సమస్యలను దృష్టిలో పెట్టుకుని వైద్య సేవలు అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రకాశం, డీఐఓ రవిరాజు, డీసీహెచ్ఎస్‌బీసీ కే నాయక్, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ రాజశేఖర్ రెడ్డి, డీపీఎంఓ శ్రీనివాసరావు, ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ సుదర్శన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో హరినాథ్ రెడ్డి, ఎస్ఓ రమేష్ రెడ్డి, డీపీహెచ్ఎన్ఓ రేణుక ప్రభ తదితరులు పాల్గొన్నారు.